మా తల్లీ బతుకమ్మ.. పోయి రావమ్మా


జనగామలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో సద్దుల బతుకమ్మ వేడుకలో మహిళల కోలాటం

- జిల్లాలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- తరలివచ్చిన అశేష మహిళావాహిని
- జనసంద్రంగా మారిన బతుకమ్మ కుంట
- ముగిసిన తొమ్మిది రోజుల సంబురం

ఆది పరాశక్తి అవతరాలైన అష్టలక్ష్ముల రూపాల్లో మహిళలతో పూజలందుకున్న బతుకమ్మ గురువారం గంగమ్మ ఒడికి చేరుకుంది. జిల్లాలో ప్రతీ పట్టణం.. పల్లెల్లో సద్దుల బతుకమ్మ సందడి కనపడింది. ఆడపడచులు తీరొక్క పూలతో పేర్చి ఆటపాటలతో పూజించిన సద్దుల బతుకమ్మను సాగనంపారు. దేవాలయ ప్రాంగణాలు, మైదానాలు, వాగులు, చెరువు గట్లు, గ్రామ కూడళ్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. మల్లొచ్చే ఏడు వరకు చల్లంగ చూడు బతుకమ్మ.. అంటూ పసుపు, కుంకుమలతో గంగమ్మ ఒడికి చేర్చారు. అనంతరం వాయి నాలు ఇచ్చి పుచ్చుకున్నారు.



జనగామ కల్చరల్, అక్టోబరు 10: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో గురువారం జనగామ జిల్లా వ్యాప్తంగా కదిలొచ్చిన మహిళా లోకం పులకించింది. సంప్రదాయ బద్ధంగా ఆడిపాడి సద్దుల సంబురం వేడుకగా జరుపుకున్నారు. బంతి, చామంతి, టేకు, తంగేడు, గునుగు తదితర వర్ణాల పుష్పాలు నేలపై పరచుకుని ఉండగా యువతులు, బాలికలు ఉత్సాహంగా కోలాటమాడి కొత్త శోభను అద్దారు. పోయిరా బతుకమ్మ ... పోయిరావమ్మా ... మళ్లొచ్చె ఏడాది తిరిగి రావమ్మా .. అంటూ గంగమ్మ సన్నిధికి సాగనంపారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

ముగిసిన తొమ్మిది రోజుల వేడుక...

తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు ముగిశాయి. జనగామ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలను

మిగతా 10వ పేజీలో...


బతుకమ్మ కుంటలో కిక్కిరిసిన జనం

రఘునాథపల్లి
అంగడిలో పండుగ రద్దీ

ఒక్కరోజే 10 కోట్లకు పైగా వ్యాపారం

వివరాలు 10వ పేజీలో

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా


వార్డులో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 10: ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది వారి విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వీడి రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఓపీ రిజిస్టర్‌ను, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను, వార్డులను పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సకాలంలో మందులు ఇస్తున్నారా, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తున్నామని ప్రజలు వాటిని వినియోగించుకోవాలన్నారు. వ్యాధుల భారినపడిన సమయంలో ప్రజలు ధైర్యంగా ఉండి చికిత్స చేయించుకోవాలని కోరారు. నమ్మకంతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించి వారిలో ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, తహసీల్దార్ దేవులపల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌కుమార్, సూపరింటెంట్ డాక్టర్ సంధ్య, డాక్టర్ ఎన్. సంధ్య, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్ట్ చేసిన నూతన ఉపాధ్యాయులు


రిపోర్టు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఈవో రాము

జనగామ కల్చరల్, అక్టోబరు 10: డీఎస్సీ-2024 లో అర్హత సాధించి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న నూతన ఉపాధ్యాయులు గురువారం స్థానిక డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేశారు. మొత్తం 199 మంది నియామక పత్రాలు అందుకోగా 178 మంది రిపోర్టు చేశారని డీఈవో కె.రాము తెలిపారు. మిగిలిన 21 మంది ఈ నెల 11న డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆయన కోరారు. కాగా నూతన ఉపాధ్యాయుల రిపోర్టు ప్రక్రియను డీఈవో కె.రాము పరిశీలించారు.

జీతాల కోసం జీపీ కార్మికుల నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 10: పండుగపూట జీతాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను జీపీ కార్మికులు కోరగా అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడడంతో చేసేది ఏమీలేక ఘన్‌పూర్ జీపీ మహిళ కార్మికులు గురువారం పంచాయతి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మహిళ కార్మికులకు వేతనాలు అందించాలని వేడుకొన్నారు. గుర్రం పెంటమ్మ, మేడ కోమల, చింత సువార్త, చింత రేణుక, లలిత, హారిక, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జయంతి



జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జయంతిని అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జే.జయంతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిగా పని చేసిన ఆమె పదోన్నతిపై హనుమకొండ జిల్లాకు వచ్చారు. ఆమెకు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.

కొత్తగా నియమితులైన టీచర్లు నేడు రిపోర్టు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 : డీఎస్సీ-2024 ద్వారా కొత్తగా ఎంపికై నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులంతా హనుమకొండ జిల్లా డీఈవో కార్యాలయంలో శుక్రవారం రిపోర్టు చేయాల్సిందిగా డీఈవో డి. వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నియామక పత్రాలు పొందిన 169 మంది ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో విధిగా రిపోర్టు చేయాల్సిందిగా ఆమె సూచించారు.

సంబురం 'సద్దుల' పర్వం


హనుమకొండ పద్మాక్షి గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు




చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ గుండు సుధారాణి


హనుమకొండ పద్మాక్షి గుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


బతుకమ్మ పేరుస్తున్న ఎంపీ కావ్య


బతుకమ్మ పేరుస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ



గుట్టుచప్పుడు కాకుండా..

- అనుమతుల్లేకుండా వరంగల్ నగరంలో బాణసంచా తయారీ
- కళ్లుగప్పి పొరుగు జిల్లాల్లోని గోదాములకు తరలింపు
- క్షేత్రస్థాయిలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇదే అదనుగా కొందరు వ్యాపారుల దందా
- ఆరేళ్ల నాటి ఘటనను గుర్తుచేస్తున్న స్థానికులు

వరంగల్ క్రైం, అక్టోబరు 10: దసరా, దీపావళి పండుగలతో పాటు పలు కార్యక్రమాలకు బాణసంచా వినియోగం సర్వసాధారణమైంది. గతంలో తమిళనాడు శివకాశి నుంచి బాణసంచా కొనుగోలు చేసి తీసుకొచ్చి అన్ని అనుమతులతో నగరంలో విక్రయించే వారు. సాధారణ రోజుల్లో అయితే ఒకటి రెండు షాపుల్లో మాత్రమే విక్రయాలు జరిగేవి. రానురాను ఆ పరిస్థితి మారింది. ఏకంగా వరంగల్ నగరంలోనే బాణసంచా తయారీ కేంద్రాలు వెలిశాయని, అది కూడా అనుమతుల్లేకుండా జరుగుతున్నట్లు తెలుస్తోంది. చెన్నై నుంచి ముడిసరుకు తెచ్చుకుని వరంగల్‌లో బాణాసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కాశిబుగ్గ సమీపంలోని ఓ ప్రాంతంలో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారని, ఈ వ్యాపారం రుచి మరిగిన ఒకరిద్దరు వ్యక్తులు స్థానిక పోలీసులు, రాజకీయ నేతల అండతో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా జనావాసాల మధ్యే ఏర్పాటు చేశారని సమాచారం. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే స్థానికులు, అక్కడ పనిచేసే వారి పరిస్థితేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయకపోవడం, వీరి వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో తయారీ దారులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదంలో 10 మంది మృతి చెందినా ఆగని దందా

ఆరేళ్ల క్రితం వరంగల్‌లోని బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి పది మంది వరకు మృతి చెందినా నగరంలో దందా ఆగడం లేదనే ప్రచారం సాగుతోంది. దసరా ఉత్సవాలకు అడ్వాన్స్ తీసుకున్న సదరు వ్యాపారులు పెద్దఎత్తున బాణాసంచా తయారీ చేస్తున్నట్లు తెలిసింది. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుగా తయారు చేస్తున్నట్లు సమాచారం. తయారు చేసిన సరుకు పొరుగు జిల్లాలైన జనగామ, కరీంనగర్‌లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల జనగామ గోదాములో జరిగిన ప్రమాదానికి సంబంధించిన సరుకు వరంగల్‌లో తయారు చేసిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. యథేచ్ఛగా తయారు చేస్తున్న వ్యాపారులు వరంగల్ లోనే కాకుండా ఉత్తర తెలంగాణ జిల్లాలకు సరఫరా చేస్తుంటారని సమాచారం. పొరుగు జిల్లాలకు సరఫరా చేసేంత సరుకు ఇక్కడ తయారు చేస్తున్నారంటే ఆ వ్యాపారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఏంటని స్థానికులు ఆరేళ్లన నాటి ఘటనను గుర్తుచేసుకుని ఆందోళన చెందుతున్నారు.



ఈ నిబంధనలు తప్పనిసరి

బాణసంచా తయారు చేయాలన్నా, విక్రయించాలన్నా పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. షాపులు గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండేలా చూసుకోవాలి. దేవాలయాలకు 200 మీటర్ల దూరంలో షాపులు ఉంచాలి. ఆ షాపుల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండకూడదు. ప్రధానంగా జనావాసాలకు దూరంగా తయారీ కేంద్రాలు ఉండాలి.

అనుమతులు లేకుండా విక్రయాలు

ఇక బాణసంచా విక్రయించాలంటే పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. ఇవేవీ లేకుండానే వరంగల్ నగరంలో పలుచోట్ల బాణసంచా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది. వరంగల్ బట్టలబజార్‌లో ఒకటి రెండు షాపులకు మాత్రమే అనుమతులుండగా, చాలా షాపుల్లో బాణసంచా విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. వరంగల్ నగరంలోని ఒక ఆలయం సమీపంలో బాణసంచా విక్రయాలు జరుపుతున్నట్టు తెలిసింది. యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నా కట్టడి చేయాల్సిన రెండు శాఖల అధికారులు కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. రూ.కోట్లలో జరుగుతున్న వ్యాపారానికి సం బంధించి వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వరని, కట్టడి చేయాల్సిన అధికారులు తాయిలాలకు అలవాటు పడి వ్యాపారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- ప్రాణాలతో బయటపడిన మనవడు
- వరంగల్ జిల్లా అలంకానిపేటలో విషాదం

నెక్కొండ, అక్టోబరు 10: బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. తాత, మనవడు విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు అప్రమత్తమవడంతో బాలుడు సురక్షితంగా బయటపడగా, తాత మృత్యువాతపడ్డాడు. పండుగ పూట పెనువిషాదం నింపిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చీకటి యాకయ్య (41) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో బతుకమ్మ ఆడుకునేందుకు కుటుంబసభ్యులు గ్రామంలోని ఊర చేరువుకు చేరుకున్నారు. యాకయ్య భార్య, ఇద్దరు కూతుళ్లు బతుకమ్మ ఆడుకుంటుండగా, యాకయ్య పెద్ద కుమార్తె ఏడాది వయసున్న కుమారుడిని ఎత్తుకుని పక్కన ఉండి వేడుకల్ని చూస్తున్నాడు. ఇంతలో వర్షం ప్రారంభం కావడంతో తడవకుండా ఉండేందుకు వడివడిగా వెళ్తున్న క్రమంతో బతుకమ్మ వేడుకలకు అమర్చిన విద్యుత్ కాంతుల వైరు యాకయ్యకు తగిలింది. దీంతో వైరు తెగి కిందపడగా దానిపై యాకయ్య పడడంతో షాక్‌కు గురయ్యాడు. గుర్తించిన గ్రామస్థులు బాలుడిని రక్షించేందుకు యాకయ్య చేతిపై బలంగా రబ్బరు చెప్పుతో కొట్టారు. దీంతో బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన యాకయ్యను నెక్కొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందాడు. అప్పటివరకు తమతో ఉన్న యాకయ్య తిరిగిరాని లోకానికి వెళ్లడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగింది. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు స్నేహ, రుచిత ఉన్నారు. వేడుకల్లో పాల్గొన్న యాకయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


యాకయ్య మృతదేహం

లాఠీ వదిలి.. చాక్‌పీస్ పట్టి..

- టీచర్ ఉద్యోగం సాధించిన మహిళా కానిస్టేబుల్

కాటారం, అక్టోబరు 10: ఇన్నాళ్లుగా లాఠీ చేతబట్టి శాంతిభద్రతల విధులు నిర్వర్తించిన మహిళా కానిస్టేబుల్‌కు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. కాటారం పోలీస్‌స్టేషన్‌లో డబ్ల్యూపీసీగా పనిచేస్తున్న జగిత్యాల జిల్లాకు చెందిన గడిపెల్లి తేజశ్రీ ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఎంపికైంది. 2020 బ్యాచ్‌లో డబ్ల్యూపీసీగా ఎంపికై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ 317 జీవోలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు కేటాయింపు పొందిన ఆమె కాటారం పీఎస్‌లో చేరింది. సుదూర ప్రాంతంలో పోలీస్ ఉద్యోగం చేస్తూనే సొంత మండలంలోనే ఉద్యో గం చేయాలని సంకల్పించి పట్టుదల, క్రమశిక్షణతో డీఎస్సీకి సిద్ధమైంది. 65వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికైంది. టీచర్ ఉద్యోగం సాధించిన తేజశ్రీని పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.


తేజశ్రీ

నేడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

ములుగు, అక్టోబరు 10: బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాతో విద్యను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాలకు మొదటి విడతలో ఈ స్కూళ్లను మంజూరు చేయగా అందులో ములుగు ఒకటి. ములుగు మండలం ఇంచర్ల పంచాయతీ పరిధి సర్వే నంబర్ 17లోని హార్టికల్చర్ నర్సరీకి చెందిన 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ దివాకర ఇప్పటికే కేటాయించారు. గురువారం సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌తో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో స్కూల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు.

గోదావరిలో మునిగి మత్స్యకారుడి మృతి

మహదేవపూర్, అక్టోబరు 10 : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గోదావరిలో నీటమునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని పలుగులలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పసుల మల్లయ్య(48) బుధవారం చేపలు పట్టేందుకు గోదావరి వద్దకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబసభ్యులు గోదావరి తీర ప్రాంతంలో వెతకగా గురువారం మల్లయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య అమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.


మల్లయ్య మృతదేహం

రతన్‌టాటా సేవలు మరువలేనివి

- ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 : వ్యాపార రంగంలో రాణిస్తూనే పేద వర్గాలకు రతన్ టాటా సేవలన్ని మరువలేనివని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కొనియాడారు. గురువారం కేయూ హాస్టల్ ఆఫీస్‌లో రతన్ టాటా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రతన్ టాటా వ్యాపారంలో వచ్చిన లాభాల్లో 60 శాతం జాతీయం చేశారని వివరించారు. యువత రతన్‌టాటాను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. భారతీయుల గుండెల్లో చెరగాని ముద్రవేసిన గొప్ప వ్యాపారవేత్త.నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శంగా రతన్ టాటా నిలుచారని కొనియాడారు.

దేశం సంకట స్థితిలో ఉన్న సమయంలో రతన్ టాటా అపన్న హస్తం అందించారని గాదె సమ్మయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్పీ రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


తరిగొప్పుల గాంధీ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న ఆడపడుచులు


దేవరుప్పుల : సీతారాంపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


రఘునాథపల్లి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లులో పెద్ద బతుకమ్మలతో ఆడుతున్న మహిళలు

మా తల్లీ బతుకమ్మ.. పోయి రావమ్మా

నర్మెట, అక్టోబరు 10 : మండలకేంద్రంతో పాటు మచ్చుపహాడ్, వెల్దండ, అమ్మాపురం, హన్మంతాపూర్, మల్కపేట, గండిరామవరం, బొమ్మకూర్, కన్నెబోయినగూడెం గ్రామాలలో బతుకమ్మ వేడుకలు మహిళలు జరుపుకున్నారు. గ్రామ శివారుల్లో ఉన్న చెరువు కట్టల వద్ద సైతం బతుకమ్మ ఆటలు ఆడి చెరవుల్లో నిమజ్జనం చేశారు. గ్రామ పంచాయితీలు అన్ని సౌకర్యాలు కల్పించగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● తరిగొప్పుల :మండల కేంద్రంతో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మండల నాయకులు దామెర ప్రభుదాస్, కావటి సుధాకర్, చిలువేరు లింగం, జగన్‌మోహన్ రెడ్డి, అర్జుల మధుసూధన్ రెడ్డి, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

● చిలుపూర్ : మండలంలోని మల్కాపూర్, చిన్నపెండ్యాల, పల్లగుట్ట తదితర గ్రామాల్లో మహిళలు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. గురువారం మల్కాపూర్‌కు చెందిన ఎడవెళ్లి మణెమ్మ -మాధవరెడ్డి, పోలేపల్లి మాధవి -రంజి త్‌రెడ్డి, సంధ్య -రాంరెడ్డితో పాటు, తోకల కరుణ -సంపత్‌రెడ్డి తదితరులు బతుకమ్మలతో తరలివెళ్లారు. మాదిరెడ్డి ప్రవళిక -యశ్వంత్‌రెడ్డి, రమాదేవి -మోహన్‌రెడ్డి, నాయకమ్మ, పోలేపల్లి అన్విరెడ్డి, తోకల సహస్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : సద్దుల బతుకమ్మ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి పాలకుర్తితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు, గ్రామ దేవాలయాల వద్ద సద్దుల బతుకమ్మ ఉత్సవాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఎస్సై సాయిప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● బచ్చన్నపేట : సద్దుల బతుకమ్మ సంబురాలకు వరుణుడు అడ్డంకిగా నిలిచాడు. రోజంతా పూల సేకరణ, బతుకమ్మలను పేర్చుట, పూజలు చేసిన మహిళలు మూకుమ్మడిగా ఆడేందుకు గ్రామాల్లోని చావిడీల వద్దకు బతుకమ్మలను తీసుకెళ్లే సమయంలో సాయంత్రం వర్షం కురిసింది. దీంతో మహిళలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కాగా పలు గ్రామాల్లో వర్షానికి కొంత సమయం విరామం ఇవ్వడంతో కొద్ది సమయం ఆడి బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి వచ్చారు.

● దేవరుప్పుల : మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు బతుకమ్మలు ఆడేందుకు వీలుగా లైటింగ్ ఏర్పాటు చేశారు. మహిళలు బతుకమ్మలు పేర్చి, బతుకమ్మలు చేతబూని ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుని బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సవాలలో తేలిపోయారు.

● కొడకండ్ల : సద్దుల బతుకమ్మ కోసం ఆయా గ్రామపంచాయతీలు పెద్ద ఎత్తున అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. వివిధ రూపాల్లో వివిధ రకాల పూలతో ఒక్కోరోజు ఒక్కో ప్రసాదం నివేదించి మహిళలు కొలుస్తున్న బతుకమ్మను చివరిరోజున సద్దుల బతుకమ్మ రూపంలో కొలిచి గురువారం ఘనంగా వీడ్కోలు తెలిపారు. సద్దుల బతుకమ్మకు తొమ్మిది రకాల సద్దులతో నైవేద్యం సమర్పించి బతుకమ్మను పూజించుకొని ఈ సంవత్సరానికి వెళ్ళిరా బతుకమ్మ వెళ్ళిరా అంటూ వీడ్కోలు పలికారు.

● లింగాలఘణపురం :మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆడపడుచులు నూతన వస్త్రాలను ధరించి సంతోష సంబరాల నడుమ బతుకమ్మ వేడుక లను వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని వడ్డిచర్లలో తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయం ఉట్టిపడేలా సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఊరంతా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

● రఘునాథపల్లి : మండలంలో ఆనందోత్సహాల మధ్య మహిళలు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సద్దుల బతుకమ్మ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో రంగు రంగుల విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఖిలాషాపూర్, కంచనపల్లి, కోమల్ల, వెల్ది, నిడిగొండ, ఆశ్వరావుపల్లి, కుర్చపల్లి తదితర గ్రామాలలో ఇంటింటి సద్దుల జాతర ఊరంతా మైదానమైంది. మండలంలోని కంచనపల్లి గ్రామంలో రంగోజు ఈశ్వరయ్య ఇంటికి స్నేహపూర్వకంగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన దివ్య, హేమ కుటుంబ సభ్యులతో వచ్చి బతుకమ్మ ఆటపాటలలో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో సద్దులబతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో భారీ వర్షం కురువడంతో బతుకమ్మలతో వెళ్లే మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని తానేధార్‌పల్లి, ఛాగల్, పాంనూర్, నెమలిగొండ, తాటికొండ, మీదికొండ గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● స్టేషన్ ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో సద్దుల బతుకమ్మ పండుగను గురువారం మహిళలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసుకోగా వరుణుడు అడ్డు పడ్డాడు. కాగా ఘన్‌పూర్, శివునిపల్లి పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో చెరువు కట్టల వద్ద పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలు, సౌండ్ సిస్టంతో బతుకమ్మ పాటలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. సద్దుల బతుకమ్మ కార్యక్రమానికి పోలీసులు సీఐ జి.వేణు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా ఉత్తమ బతుకమ్మలకు స్టేషన్ ఘన్‌పూర్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ వారు బహుమతులు పంపిణీ చేశారు.

● జఫర్‌గడ్ : జఫర్‌గడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం మహిళలు బతుకమ్మలతో చెరువుల వద్దకు బయలు దేరే సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. బతుకమ్మ సంబురాలకు ఆటంకం ఏర్పడింది. వర్షం దృష్ట్యా కొందరు ఆటోలు, ఇతర వాహనాల్లో చెరువు వద్దకు వెళ్లడం కనిపించింది. వర్షంతో కొంత మంది మహిళలు గ్రామాల్లోని ఆలయాల్లో దేవుని సన్నిధిలో బతుకమ్మలను సమర్పించారు. జఫర్‌గడ్ పెద్ద చెరువు వద్ద మహిళలు బతుకమ్మ ఆడే స్థలంలో వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


చిల్పూరు :మల్కాపూర్‌లో బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు


బచ్చన్నపేట : కట్కూరులో బతుకమ్మలను తీసుకెళుతున్న మహిళలు


స్టేషన్‌ఘన్‌పూర్ : తానేధార్‌పల్లిలో బతుకమ్మలతో మహిళలు


కొడకండ్లలో సద్దుల బతుకమ్మలతో వెళుతున్న మహిళలు

(7వ పేజీ తరువాయి)

మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. బతుకమ్మలతో మహిళలు తరలివస్తుండగా పురవీధులన్నీ శోభాయమానంగా వెలుగొందాయి. జిల్లా కేంద్రం లోని బతుకమ్మ కుంట ప్రాంతం సద్దుల బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా జనసంద్రంగా మారింది. బతుకమ్మ కుంట మైదానం సప్తవర్ణ శోభితంగా మారింది. సాయంత్రం 5 గంటల నుంచి బతుకమ్మ కుంటకు మహిళల రాక ప్రారంభం కాగా రాత్రి 9 గంటల వరకు మహిళలు బతుకమ్మ ఆడుతూ ఉరకలేసిన ఉత్సాహంతో మైమరచిపోయారు. ఉత్సవాల సందర్భంగా బతుకమ్మ కుంట మైదానంలో భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యలో భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్డు నుంచి బతుకమ్మ కుంటకు వెళ్లే మార్గానికి ఇరువైపులా, బతుకమ్మ కుంట చుట్టూ రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. పెయింటింగ్ తో బతుకమ్మ శుభాకాంక్షలు తెలియ జేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డీసీపీ రాజమహేంద్ర నాయక్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యేతో పాటు ఆయన సతీమణి నీలిమ, మునిసిపల్ కౌన్సిలర్లు ఆసీనులై ఉత్సవాలను తిలకిం చారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలను ఎమ్మెల్యే ఎంపిక చేశారు. అనంతరం బతుకమ్మలను బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. ఎంగిలిపూల బతుకమ్మ రోజు వర్షం రాగా.. చివరి రోజైన సద్దుల బతు కమ్మకు సైతం ఆటంకం కలిగించాడు. అయినప్పటికి మహిళలు వర్షంలో తడుస్తూ బతుకమ్మలో పాల్గొన్నారు.


బతుకమ్మలతో కాకినాడకు చెందిన మహిళలు


నర్మెటలో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు

లింగాలఘణపురం మండల కేంద్రంలో..



ఎమ్మెల్యే కడియంను కలిసిన మార్కెట్ కమిటీ


ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పుష్పగుచ్చం అందిస్తున్న మార్కెట్ చైర్ పర్సన్ లావణ్య-శిరీష్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 10: నూతనంగా ఎన్నికైన స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మార్కెట్ డైరెక్టర్లు గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ పాలకమండలిలో అవకాశం కల్పించినందుకు గాను ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని కమిటీ సభ్యులు కడియంకు తెలిపారు. కడియంను కలిసిన వారిలో కొత్త మార్కెట్ డైరెక్టర్లు బాస్కుల కిరణ్, మాచర్ల కుమారస్వామి, మారపాక వసంత్, నీల వెంకటేశ్వర్లు, ఎమ్మీ ఆయూషాబేగం, కాసాని బొందయ్య, ఇల్లెందుల బాబు, పేరాల సుధాకర్, భూక్య సురేష్, మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, వెల్మజాల రాంరెడ్డి, గోళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులతో పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎస్సై నవీన్‌కుమార్

చిలుపూర్, అక్టోబరు 10 : క్రీడలతో దేహదారుఢ్యం పెంపొం దుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని పల్లగుట్టలో ఆయన తండ్రి, తొలి దశ తెలంగాణ ఉద్యమకారుడు పొట్లపల్లి చక్రధర్ రావు స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అయినటువంటి రతన్‌టాటా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావుతో పాటు, ఎస్సై నవీన్‌కుమార్‌లు మాట్లాడారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, పోలీసు సిబ్బంది వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

చిలుపూర్, అక్టోబరు 10 : యువత జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి కుమార్తె పాగాల సంజనారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రాజవరంలో సంపత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న ఆర్‌పీఎల్ (రాజవరం ప్రీమియర్ లీగ్) క్రికెట్ క్రీడా ముగింపు పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజనారెడ్డి మాట్లాడుతూ, తన తండ్రి స్మారకార్థం యువత క్రికెట్ పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందని, యువత క్రీడలతో పాటు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు విశిష్ఠ అతిథిగా హాజరైన స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ చేతులమీదుగా షీల్డులతో పాటు, రూ 15 వేలు, రూ 10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాగాల వెంకట్‌రెడ్డి, బత్తుల సూర్యనారాయణ, ఎడ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జనగామ యాదగిరి, అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్, ఎమ్మీ యాకూబ్‌పాషా, మోటం రాజు, రంగు రవి, పంతం రాజుగౌడ్, మచ్చ రమేష్, ఎడ్ల రాజేశ్, నిర్వాహకులు ఎమ్మీ అసదుద్దీన్, ఎడ్ల అబ్రహం, విష్ణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి


ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన నూతన మార్కెట్ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, సొసైటీ చైర్మన్, నేతలు

జఫర్‌గడ్, అక్టోబరు 10 :స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ నూతన కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన జఫర్‌గడ్ మండలానికి చెందిన నూకల అయిలయ్యతో పాటు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ సందర్భంగా కమిటీలో స్థానం కల్పించినందులకు అయిలయ్య ఎమ్మెల్యేను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన అయిలయ్యను ఎమ్మెల్యే కడి యం శ్రీహరి శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, కడియం ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి బానోత్ రాజేశ్‌నాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా కో-ఆర్డినేటర్ పోరెడ్డి సత్యనారా యణరెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


వెల్దండలో పూజల్లో పాల్గొన్న భక్తులు

జఫర్‌గడ్, అక్టోబరు 10 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన జఫర్‌గడ్, మండలంలోని కూనూ రు, ఉప్పుగల్లు గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించబడిన ఉత్సవమూర్తుల వద్ద భక్తులు పూజలు చేశారు. ఎనిమిదవ రోజు గురువారం భక్తులకు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చింది.

● నర్మెట : మండలకేంద్రంతో పాటు మచ్చుపహడ్, వెల్దండ గ్రామాలలో నెలకొల్పిన దుర్గామాత మండపాల వద్ద గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వెల్దండ గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద హోమం నిర్వహించారు. ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

జనగామ మార్కెట్ కమిటీలో నలుగురికి స్థానం


బాషమియా గాదె రమేష్ కుమార్ రమేష్

రఘునాథపల్లి, అక్టోబరు 10: జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన బనుక శివరాజ్ యాదవ్‌ను, వైస్ చైర్మన్‌గా లింగాలఘణపురం మండలానికి చెందిన కొల్లూరి నర్సింహులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.. మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలంలోని నలుగురికి స్థానం కల్పించారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మహ్మద్ బాషమియాతో పాటు ఖిలాషాపూర్‌కు చెందిన గాదె రమేష్, కోమల్లకు చెందిన బంద కుమార్, కుర్చపల్లికి చెందిన తోటకూరి రమేష్‌కు ప్రాధాన్యత కల్పించారు. మండలం నుండి నలుగురిని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

లింగాలఘణపురం, అక్టోబరు10: మండలంలోని వడ్డిచర్లలో ఈ నెల 2న విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డ వట్టిపెల్లి వీరస్వామి(41) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జఫర్‌గడ్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు


రెసిడెన్షియల్ స్కూల్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న నాయక్

జఫర్‌గడ్, అక్టోబరు 10 : విద్యార్థులకు అన్ని వసతులతో నాణ్యమైన విద్యనందించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాలుగు రెసిడెన్షియల్ పాఠశాలలు తగు వసతి సౌకర్యాలతో ఒకే కాంప్లెక్స్‌లో ఉండేలా తొలి విడత రాష్ట్ర వ్యాప్తంగా 28 రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చేపడుతోంది. కాగా, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్. వెంకన్న నాయక్ స్థానిక తహసిల్దార్ శంకరయ్యతో కలిసి అక్కడ ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకన్న మాట్లాడుతూ జఫర్‌గడ్ - స్టేషన్‌ఘన్‌పూర్ ప్రధాన రహదారి పక్కన జఫర్‌గడ్ మండల పరిధిలో కోనాయిచలం శివారులో సుమారు 26 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. స్థలాన్ని పరిశీలించి ఇందులో 21 ఎకరా ల భూమిని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ వెంట ఎంఆర్ఐ, సర్వేయర్ ఉన్నారు.

రఘునాథపల్లి అంగడిలో పండుగ రద్దీ


రఘునాథపల్లి అంగడిలో గొర్రెల అమ్మకాలు జరుగుతున్న దృశ్యం

రఘునాథపల్లి, అక్టోబరు 10: దసరా వచ్చిందయ్యా..సరదా తెచ్చిందయ్యా అనే పాటను నిజం చేయడానికి ప్రజలు తమ జేబులను ఖాళీ చేసుకోవడానికి సైతం వెనుకాడడం లేదు.. దసరా అంటేనే మటన్ ముక్క.. మందు చుక్క తప్పనిసరిగా ఉండాల్సిందే.. తెలంగాణ ప్రాంతంలోనే పేరుగాంచిన గొర్రెలు, మేకలు ప్రత్యేకంగా విక్రయించే రఘునాథపల్లి అంగడి గురువారం వ్యాపారులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. మండల కేంద్రంలో ప్రతి గురువారం జరుగుతున్న క్రమంలో శనివారమే దసరా పండుగ కావడంతో గొర్రెలు, మేకల కొనుగోళ్ల చేయడానికి పలు జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారస్తులతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దసరా పండుగ కావడంతో ఒక్క రోజే సుమారు 3 వేల నుంచి 4 వేల వరకు గొర్రెలు, మేకల అమ్మకాల ద్వారా రూ.10 నుంచి 12 కోట్ల వ్యాపారం జరిగినట్లు సమాచారం. గొర్రెలు, మేకల క్రయ, విక్రయాలలో పేరు గాంచిన రఘునాథపల్లి అంగడిలో నాణ్యత కలిగిన జీవాలు సరసమైన ధరలకు లభిస్తాయని వివిధ జిల్లాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసాలకు ఓర్చుకుని వచ్చిన వ్యాపారులకు, సొంత అవసరాల కోసం వచ్చిన ప్రజలకు అంగడిలో యాటలకు పలుకుతున్న ధరలను చూసి తలలు పట్టుకుంటూ ఆశ్చర్యానికి గురి కావాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గొర్రె పొట్టేళ్లు, మేక పోతులకు భారీ డిమాండ్ ఉండడంతో ఎక్కువ రేట్లు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. సుమారు 15 కిలోల నుంచి 20 కిలోల మాంసం లభించే గొర్రె పొట్టేళ్లు, మేక పోతులకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితులు ఉండడంతో కిలో మాంసానికి రూ.1000 వరకు ధర పలుకుతుందని పలువురు తెలుపుతున్నారు.. దసరా పండుగ రోజు గొర్రె పొట్టేళ్లు, మేక పోతుల మాంసం తినాలనే తాపత్రయంతో ధరలు ఎక్కువ ఉన్నప్పటికీ పలువురు అధిక ధరలు చెల్లించి సైతం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం కొసమెరుపు.

ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం


స్పెషల్ ఆఫీసర్‌ను సన్మానిస్తున్న ఈవో, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 10: గ్రామంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానని శివునిపల్లి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ అకా రపు పాపయ్య తెలిపారు. ఇటీవల గ్రామ స్పెషల్ ఆఫీసర్ బదిలీకాగా ఆయన స్థానంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పాపయ్య గురువారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన ఆయనను ఈవో తిరునగిరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చిగురు విజయ్ పటేల్, సీపీఎం నాయకుడు తోట రమేష్, సిబ్బంది రాజు, వినయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.